జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజలకోసం
## కరీంనగర్
జగిత్యాల - రాజన్న సిరిసిల్ల - పెద్దపల్లి
శుక్రవారం 19-12-2025 పేజీలు : 8





లోక్ అదాలత్ ద్వారా వివాదాలకు

## సామరస్య పరిష్కారం

- జాతీయ మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి
- రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా

3

# కాంగ్రెస్ వర్సెస్ బీజేపీ

కరీంనగర్‌లో పొలిటికల్ వార్

నేషనల్ హెరాల్డ్ సెగ..

కరీంనగర్ బ్యూరో,డిసెంబర్ 18 (ప్రజాజ్యోతి): నేషనల్ హెరాల్డ్ కేసులో ఏఐసీసీ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలకు కోర్టులో ఊరట లభించడంతో కరీంనగర్ రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. ఒకవైపు కాంగ్రెస్ సంబరాలు, నిరసనలు.. మరోవైపు బీజేపీ ప్రతిఘటనతో నగరంలో ఉద్రిక్తత నెలకొంది..కాంగ్రెస్ శ్రేణుల 'చలో ఎంపీ క్యాంపు కార్యాలయం' ఏఐసీసీ, టీపీసీసీ పిలుపు మేరకు కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. కోర్టు చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం నుండి చైతన్యపురిలోని బీజేపీ ఎంపీ క్యాంపు కార్యాలయం ముట్టడికి కాంగ్రెస్ నాయకులు బయలుదేరారు.

మిగతా 5లో...



### నాయకుల అరెస్ట్:

శాంతియుతంగా వెళ్తున్న తమను పోలీసులు అడ్డుకోవడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ నాయకులు రోడ్డుపై బైఠాయించారు. దీంతో ఉద్రిక్తత చోటుచేసుకోగా, పోలీసులు నాయకులను బలవంతంగా అరెస్ట్ చేసి పోలీస్ ట్రైనింగ్ సెంటర్ కు తరలించారు.నరేంద్ర మోదీ క్షమాపణ చెప్పాలి



# అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

కార్పొరేషన్ పరిధిలో విస్తృతంగా పర్యటించిన రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారి, జిల్లా కలెక్టర్



పెద్దపల్లి జిల్లా ప్రతినిధి ,(ప్రజా జ్యోతి(, డిసెంబర్ 18: నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారి, జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.

మిగతా 5లో...



# విద్యార్థులకు ఉచిత దంత పరీక్షలు

అవసరమైన వారికి ప్రధాన ఆస్పత్రిలో చికిత్స

జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

2 లో..

# సోమాజిగూడ యశోద హాస్పిటల్స్‌లో విజయవంతమైన బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంట్

## సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ కే అశోక్ కుమార్




**కరీంనగర్ టౌన్ డిసెంబర్ 18 (ప్రజా జ్యోతి ):** సోమాజిగూడలోని యశోద హాస్పిటల్స్ మరో వైద్య అద్భుతాన్ని సృష్టించింది. కరీంనగర్‌కు చెందిన 15 ఏళ్ల బాలుడు బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతుండగా, అతనికి అలోజెనిక్ బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంట్‌ను విజయవంతంగా నిర్వహించారు. సీనియర్ కన్సల్టెంట్ హెమటో%-%ఆంకాలజీ %డ% బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంట్ వైద్యుడు డాక్టర్ కె. అశోక్ కుమార్ పర్యవేక్షణలో నిర్వహించిన చికిత్స అనంతరం బాలుడు పూర్తిగా కోలుకున్నట్లు వైద్యులు ప్రకటించారు. ఈ సందర్భంగా కరీంనగర్ యశోద ఆస్పత్రిలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ...యశోద హాస్పిటల్స్‌లోని హెమటాలజీ మరియు బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంట్ యూనిట్ ద్వారా లుకేమియా, లింఫోమాస్, మల్టిపుల్ మైలోమా, అప్లాస్టిక్ అనీమియా, తలసేమియా, సికిల్ సెల్ డిసీజ్ వంటి క్యాన్సర్ మరియు క్యాన్సర్ కాని రక్త రుగ్మతలకు వయోజనులు, పిల్లలకు సమగ్ర చికిత్సలు అందిస్తున్నట్లు తెలిపారు.బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించిన డాక్టర్ అశోక్ కుమార్ ఇప్పటివరకు పిల్లలు మరియు పెద్దలలో 400కు పైగా బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంట్‌లను విజయవంతంగా నిర్వహించినట్లు వెల్లడించారు. ఈ కేంద్రంలో కఠినమైన అంతర్జాతీయ వైద్య ప్రమాణాలు, ఆధునిక రోగ నిర్ధారణ పద్ధతులు, అత్యాధునిక మార్పిడి మౌలిక సదుపాయాలు మరియు అనుభవజ్ఞులైన బహుళ విభాగ వైద్య బృందం అందుబాటులో ఉన్నట్లు తెలిపారు.సకాలంలో రోగ నిర్ధారణతో పాటు బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ వంటి అధునాతన చికిత్సల ద్వారా నేడు అనేక రక్త క్యాన్సర్‌లు మరియు జన్యు రక్త రుగ్మతలను పూర్తిగా నయం చేయడం లేదా నియంత్రించడం సాధ్యమవుతుందనిడాక్టర్అశోక్‌కుమార్‌పేర్కొన్నారు.సోమాజిగూడలోని యశోద హాస్పిటల్స్ నైతిక విలువలతో కూడిన, అధిక నాణ్యతతో పాటు సరసమైన ఖర్చుతో మార్పిడి వైద్యం అందించేందుకు కట్టుబడి ఉందని, దేశవ్యాప్తంగా ప్రపంచ స్థాయి హెమటాలజీ సేవలను అందిస్తున్నట్లు ఆసుపత్రి ప్రతినిధులు తెలిపారు.

# పార్లమెంట్‌లో గాంధీ పేరును తొలగించడంపై ఆగ్రహం

## - పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ తీవ్ర విమర్శ



**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి ప్రజాజ్యోతి,డిసెంబర్ 18, (ప్రజా జ్యోతి):** ఉపాధి హామీ పథకం నుంచి మహాత్మా గాంధీ పేరును తొలగించడంపై పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ తీవ్రంగా వ్యాఖ్యానించారు. బీజేపీ ప్రభుత్వం గాంధీని కేవలం పథకాల నుంచే కాకుండా దేశ చరిత్ర నుంచే చెరిపివేసే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. 1948లో గాడ్సే మహాత్మా గాంధీని శారీరకంగా హత్య చేశాడని గుర్తు చేసిన ఎంపీ, నేడు మోదీ ప్రభుత్వం గాంధీ ఆలోచనలు, విలువలు, ఆయన పేరునే చంపే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. కోట్లాది పేదలకు జీవనాధారంగా నిలిచిన ఉపాధి హామీ పథకం నుంచి గాంధీ పేరును తొలగించడం పూర్తిగా అన్యాయమని స్పష్టం చేశారు.మోదీ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం కాకుండా అంబానీ, అదానీ లాంటి కార్పొరేట్ శక్తుల ప్రయోజనాల కోసమే పనిచేస్తోందని ఆరోపించారు. ప్రజా సంక్షేమాన్ని విస్మరించి దేశాన్ని కార్పొరేట్ శక్తులకు తాకట్టు పెడుతోందని దుయ్యబట్టారు.ఆర్‌ఎస్‌ఎస్ అజెండాను దేశంపై బలవంతంగా రుద్దే ప్రయత్నం జరుగుతోందని, 2047లో వికసిత్ భారత్ లక్ష్యంగా కాకుండా "గాంధీ ముక్త భారత్ 2047" దిశగా మోదీ ప్రభుత్వం అడుగులు వేస్తోందని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. గాంధీ ఆలోచనలు, విలువలే భారత ప్రజాస్వామ్యానికి పునాదులని, వాటిని ఎవరూ చెరిపివేయలేరని ఎంపీ గడ్డం వంశీకృష్ణ స్పష్టం చేశారు.

# మేరా యువభారత్ ఆధ్వర్యంలో యువజన సంఘాలకు క్రీడా సామాగ్రి పంపిణీ

## 2025-26 ఆర్థిక సంవత్సరానికి దరఖాస్తుల ఆహ్వానం

**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 18 (ప్రజా జ్యోతి):** యువజన వ్యవహారాల, క్రీడల మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వ ఆధ్వర్యంలోని మేరా యువభారత్ సంస్థ 2025%-%26 ఆర్థిక సంవత్సరానికి గాను ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని యువజన సంఘాలకు క్రీడా సామాగ్రి అందజేయనున్నట్లు డిస్ట్రిక్ట్ యూత్ ఆఫీసర్ ఎం. వెంకట్ రాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు.ఈ పథకం కింద ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు మొత్తం 120 యువజన సంఘాలకు క్రీడా సామాగ్రి పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాలకు తలా 30 సంఘాల చొప్పున కేటాయింపు ఉంటుందని వివరించారు.క్రీడా సామాగ్రి కోసం దరఖాస్తు చేసుకునే యువజన సంఘాలు తప్పనిసరిగా రిజిస్టర్డ్ అయి ఉండాలని, సంఘ సభ్యుల వయస్సు 18 నుంచి 29 సంవత్సరాల లోపు ఉండాలని సూచించారు. దరఖాస్తుతో పాటు యువజన సంఘం రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ జిరాక్స్, బైలాస్ కాపీ, అలాగే గత ఐదు సంవత్సరాలుగా నిర్వహించిన కార్యక్రమాలకు సంబంధించిన పత్రికా ప్రకటనలు, ఫోటోలు జత చేయాలని తెలిపారు.

దరఖాస్తు ప్రొఫార్మాను మేరా యువభారత్ కరీంనగర్ జిల్లా కార్యాలయం (బస్టాండ్ ఎదురుగా) నుండి పొందవచ్చని తెలిపారు. ఆసక్తి కలిగిన యువజన సంఘాలు డిసెంబర్ 31, 2025 సాయంత్రం 5 గంటల లోపల పూర్తి దరఖాస్తులను అదే కార్యాలయంలో సమర్పించాలని కోరారు.

యువత క్రీడల వైపు మరింతగా ఆకర్షితులై శారీరక, మానసిక అభివృద్ధి సాధించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని డిస్ట్రిక్ట్ యూత్ ఆఫీసర్ తెలిపారు.

# పోతుగల్ గ్రామ సర్పంచ్‌గా ఎన్నికైన యాదమ్మ శ్రీనివాస్‌కు ఘన సన్మానం



**ముస్తాబాద్, డిసెంబర్ 18( ప్రజా జ్యోతి ):** పోతుగల్ గ్రామ సర్పంచ్‌గా ఎన్నికైన పెద్దియాదమ్మ శ్రీనివాస్ ని రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ గారు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తూ గ్రామాభివృద్ధికి నిరంతరం కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సుధాకర్ రావు , నారాయణ రావు , మాజీ (ముస్తాబాద్) సర్పంచ్ ఓరగంటి తిరుపతి బాబు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ఉచిత దంత పరీక్షలు

## అవసరమైన వారికి ప్రధాన ఆస్పత్రిలో చికిత్స

## జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి






**కరీంనగర్ బ్యూరో, డిసెంబర్ 18 (ప్రజాజ్యోతి):** జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, కస్తూరిబా గాంధీ విద్యాలయాలు, మోడల్ స్కూళ్లు, జిల్లా పరిషత్ పాఠశాలల్లోని సుమారు 12 వేల మంది విద్యార్థులకు ఉచిత దంత వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని, అవసరమైన వారికి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చికిత్స అందించనున్నామని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. శాతవాహన యూనివర్సిటీ సమీపంలోని ప్రభుత్వ బధిరుల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు నిర్వహిస్తున్న దంత వైద్య శిబిరాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు.బధిర విద్యార్థులకు నిర్వహించిన దంత వైద్య పరీక్షలు, చికిత్స వివరాలను క్యాంపు నిర్వహిస్తున్న డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు, మున్సిపల్ కార్మికులు, మల్టీపర్పస్ వర్కర్లకు దంత వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన చికిత్స చేయించాలని నిర్ణయించామని అన్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే మున్సిపల్ కార్మికులకు ఒక ప్రత్యేక క్యాంపు నిర్వహించామని తెలిపారు. జిల్లావ్యాప్తంగా సుమారు 12 వేల మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రత్యేక క్యాంపుల ద్వారా దంత వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని అన్నారు. ఇప్పటివరకు 9 వేల మంది విద్యార్థులకు పరీక్షలు పూర్తయ్యాయని, 24 మందికి చికిత్స అవసరంగా భావించి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఉచితంగా చికిత్స అందజేశామని తెలిపారు. స్క్రీనింగ్ పూర్తయ్యాక ఎంత మంది పిల్లలకు చికిత్స అవసరమో గుర్తించి వైద్యం చేయిస్తామని అన్నారు. కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో దంత వైద్య చికిత్సకు కావలసిన అన్ని సౌకర్యాలు, వైద్య బృందం ఉందని అన్నారు. చికిత్సకు అవసరమైన మరిన్ని సౌకర్యాలు కూడా కల్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి సూపరింటెండెంట్ వీరారెడ్డి, ఆర్ఎంవో నవీన, డెంటల్ ప్రత్యేక నిపుణులు రవి ప్రవీణ్, రణధీర్, సాహిత్య, ప్రిన్సిపల్ కమల పాల్గొన్నారు.

# ఎల్లారెడ్డిపేట సర్పంచ్ కి ఆత్మీయ సన్మానం

## గుండారం లహరి కృష్ణారెడ్డి ఎల్లారెడ్డిపేట ప్యాక్స్ చైర్మన్

**ఎల్లారెడ్డిపేట డిసెంబర్ 18 (ప్రజాజ్యోతి):** ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని సర్పంచిగా ఎన్నికైన ఎలగందుల నర్సింలు ఉప సర్పంచ్ గా బందారం బాల్ రెడ్డి గురువారం రోజు తన నివాసంలో లహరికృష్ణ రెడ్డి దంపతులు ఆత్మీయ సన్మానం చేసి చేశారు.



# నూతన సర్పంచులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు

**గ్రామాల అభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలి**

**- ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు**



పెద్దపల్లి జిల్లా ప్రతినిధి,(ప్రజా జ్యోతి) డిసెంబర్ 18: పెద్దపల్లి నియోజకవర్గంలో మూడవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన పలు గ్రామాల నూతన సర్పంచులు గురువారం పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావును వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణ రావు నూతనంగా ఎన్నికైన సర్పంచులు, ప్రజా ప్రతినిధులను శాలువాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామాల అభివృద్ధికి ప్రజల ఆశయాలను ప్రతిబింబించే విధంగా పనిచేయాలని ఆయన సూచించారు. గ్రామ పంచాయతీలు ప్రజలకు అత్యంత సమీప పరిపాలనా వ్యవస్థలని పేర్కొన్న ఎమ్మెల్యే, మౌలిక వసతుల అభివృద్ధి, సంక్షేమ పథకాల సమర్థవంతమైన అమలు, పారదర్శక పాలనపై దృష్టి పెట్టాలని సర్పంచులకు సూచించారు. గ్రామాల సమగ్ర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకొని, ప్రజాప్రతినిధులు అందరూ సమన్వయంతో పని చేయాలని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు కోరారు.

# రాఘవపూర్ నూతన సర్పంచ్‌కు ఘన సన్మానం

**సర్పంచ్‌గా బాధ్యతాయుతంగా గ్రామాభివృద్ధికి కృషి చేయాలి**

**- మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి**



పెద్దపల్లి జిల్లా ప్రతినిధి (ప్రజా జ్యోతి), డిసెంబర్ 18: పెద్దపల్లి నియోజకవర్గంలోని పెద్దపల్లి మండలం రాఘవపూర్ గ్రామానికి నూతనంగా ఎన్నికైన బీఆర్ఎస్ గ్రామ సర్పంచ్ తాడిచెట్టు చామంతి శ్రీకాంత్‌ను మాజీ శాసనసభ్యులు దాసరి మనోహర్ రెడ్డి ఘనంగా సన్మానించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా దాసరి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ గ్రామాభివృద్ధికి అంకితభావంతో కృషి చేయాలని నూతన సర్పంచ్‌కు సూచించారు. గ్రామాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లడంలో బీఆర్ఎస్ నాయకత్వం కీలక పాత్ర పోషిస్తుందని ఆయన అన్నారు. రాఘవపూర్ గ్రామాన్ని మౌలిక వసతులు, సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల అమలులో ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దే దిశగా సర్పంచ్ ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మార్కు లక్ష్మణ్, గ్రామ అధ్యక్షుడు కొమురయ్య, కుమారస్వామి, రామస్వామి, బీఆర్ఎస్ (టీఆర్ఎస్) నాయకులు పాల్గొన్నారు.

# ప్రజల ఆశీర్వాదంతో ఘన గెలుపు

**కొండపాక సర్పంచ్ పీఠాన్ని చేజిక్కించుకున్న దాట్ల వీరస్వామి**



వీణవంక, డిసెంబర్ 18, ( ప్రజాజ్యోతి):వీణవంక మండలం కొండపాక గ్రామంలో జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి దాట్ల వీరస్వామి ఘన విజయం సాధించారు. ప్రజల విశ్వాసం, ఆశీర్వాదంతో సాధించిన ఈ గెలుపు గ్రామంలో కొత్త అభివృద్ధి యుగానికి నాంది పలికిందని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కొండపాక ప్రజల మద్దతుతో దాట్ల వీరస్వామి విజయానికి బాటలు వేసిన ఈ ఫలితం బీజేపీకి ఉత్సాహాన్నిచ్చే శుభవార్తగా మారింది. గ్రామాభివృద్ధి, పారదర్శక పాలనతో ముందుకు సాగుతామని గెలుపు అనంతరం వీరస్వామి తెలిపారు.

# వేములవాడ పట్టణంలోని తిప్పాపూర్ లోబెస్ట్ బేకరీ స్వీట్స్ ప్రారంభం

వేములవాడ,డిసెంబర్ 18:ప్రజాజ్యోతిః. వేములవాడ ఈరోజు పట్టణం తిప్పాపూర్ బస్సు స్టాండ్ వద్ద నూతనంగా బెస్ట్ బేకరీ %ఠ%స్వీట్స్ ను మాజీ మునిసిపల్ చైర్మన్ రామతీర్థపు మాధవి ప్రారంభించారు, ఇట్టి కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మన్ రామతీర్థపు రాజు మాజీ కౌన్సిలర్ గోలి మహేష్, మారం కుమార్ జోగిని శంకర్, సుంకపాక రాజు షాప్ ఓనర్స్ తదితరులు పాల్గొన్నారు.



# రేషన్ కార్డు లబ్ధిదారులు ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలి

**జిల్లాలో 76.29 శాతం మాత్రమే పూర్తి - జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**



పెద్దపల్లి జిల్లా ప్రతినిధి,( ప్రజాజ్యోతి), డిసెంబర్ 18 : రేషన్ కార్డు లబ్ధిదారులు తమ ఈ-కేవైసీ తప్పనిసరిగా పూర్తి చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ప్రతి రేషన్ కార్డుదారు తన వేలిముద్ర ఆధారంగా 100 శాతం ఈ-కేవైసీ పూర్తి చేయాల్సి ఉందని ఆయన పేర్కొన్నారు. జిల్లాలో ఇప్పటివరకు కేవలం 76.29 శాతం మాత్రమే ఈ-కేవైసీ పూర్తి కాగా, ఇంకా 1,68,272 మంది రేషన్ కార్డు లబ్ధిదారులు మిగిలి ఉన్నారని తెలిపారు. 5 సంవత్సరాల వయస్సు పూర్తయిన ప్రతి లబ్ధిదారుడు తమ నివాసానికి సమీపంలో ఉన్న రేషన్ దుకాణానికి వెళ్లి ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. అయితే 5 సంవత్సరాల వయస్సు పూర్తికాని పిల్లలకు ఈ-కేవైసీ నుంచి మినహాయింపు ఉంటుందని స్పష్టం చేశారు. ఈ-కేవైసీ ప్రక్రియను సజావుగా పూర్తిచేయడానికి ఫెయిర్ ప్రైస్ షాప్ (%ఫీ%) డీలర్లు తమ రేషన్ దుకాణాలను తెరిచి ఉంచి కార్డు దారులకు సహకరించాలని ఆదేశించారు. అలాగే ఈ-కేవైసీపై అవగాహన కల్పించేలా రేషన్ షాపుల వద్ద ఫ్లెక్సీ బోర్డులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పథకాల లబ్ధి నిరంతరంగా అందేందుకు మిగిలిన రేషన్ కార్డు దారులందరూ వెంటనే ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష కోరారు.

# లోక్ అదాలత్ ద్వారా వివాదాలకు సామరస్య పరిష్కారం

**జాతీయ మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి-రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝూ**



పెద్దపల్లి జిల్లా ప్రతినిధి,( ప్రజా జ్యోతి) డిసెంబర్ 18: ఈ నెల 21వ తేదీ ఆదివారం నిర్వహించనున్న జాతీయ మెగా లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ పిలుపునిచ్చారు. లోక్ అదాలత్ ద్వారా వివాదాలు శాంతియుతంగా, రాజీ మార్గంలో పరిష్కారం అవుతాయని ఆయన తెలిపారు. రాజీకి అనువైన కంపౌండబుల్ క్రిమినల్ కేసులు, సివిల్ తగాదాలు, ఆస్తి విభజన, కుటుంబ, వైవాహిక వివాదాలు, బ్యాంకు బకాయిల వసూలు, విద్యుత్ చౌర్యం, చెక్ బౌన్స్ కేసులు వంటి వాటిని లోక్ అదాలత్ ద్వారా ఇరువర్గాలు చర్చించుకుని పరిష్కరించుకోవచ్చని కమిషనర్ పేర్కొన్నారు. చిన్న చిన్న తగాదాల కారణంగా కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయం, డబ్బు వృథా చేసుకోకుండా "రాజీయే రాజమార్గం" అనే సిద్ధాంతంతో జుడీషియల్ శాఖ కల్పించిన ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. పెద్దపల్లి, మంచిర్యాల జోన్ల పరిధిలోని పోలీస్ అధికారులు, కోర్టు విధులు నిర్వహించే కానిస్టేబుళ్లు, పోలీస్ సిబ్బంది రాజీ పడదగిన కేసులను గుర్తించి, ఇరువర్గాలను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించి పరిష్కారం దిశగా ప్రయత్నాలు చేయాలని కమిషనర్ ఆదేశించారు. తమ కేసుల్లో రాజీ కోరుకునే వ్యక్తులు సంబంధిత పోలీస్ అధికారులను సంప్రదించాలని సూచించారు. లోక్ అదాలత్ ద్వారా వివాదాలు త్వరితగతిన పరిష్కారమై బాధితులకు సత్వర న్యాయం లభిస్తుందని ఆయన తెలిపారు. **లోక్ అదాలత్‌పై ముఖ్య సూచనలు:ఇరుపక్షాల సమ్మతితోనే రాజీ సాధ్యం.** లోక్ అదాలత్‌లో కుదిరిన రాజీ చట్టపరంగా తుది తీర్పుగా పరిగణించబడుతుంది. న్యాయమూర్తులు, న్యాయవాదులు, సామాజిక కార్యకర్తల సమన్వయంతో కేసుల పరిష్కారం జరుగుతుంది. ప్రజలు, పోలీసులు, న్యాయస్థానాలు సమన్వయంతో పనిచేస్తే చిన్న వివాదాలు పెద్ద సమస్యలుగా మారకుండా ముందే పరిష్కరించవచ్చని పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ అన్నారు.

# బాల్య వివాహాల నిర్మూలనకు 1098 కి ఫోన్ చేయండి



చొప్పదండి, డిసెంబర్ 18( ప్రజా జ్యోతి): మహిళా శిశు సంక్షేమ శాఖ చైల్డ్ హెల్ప్ లైన్ 1098 విభాగం వారు గురువారం బాల్ వివాహ ముక్త్ భారత్ అవగాహన కార్యక్రమం చొప్పదండి మండలం రాగంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్ లైన్ 1098 జిల్లా కో ఆర్డినేటర్ ఆవుల సంపత్ యాదవ్ పాల్గొని బాల్య వివాహాలపైన పిల్లలకు అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు జరుగుతున్నట్లు సమాచారం ఉంటే 1098 ఉచిత నెంబర్ కు కానీ 9490881098 కు కానీ సమాచారం ఇవ్వాలని అన్నారు. 18 నిండని అమ్మాయికి, 21 సంవత్సరాలు నిండని అబ్బాయికి పెళ్లి చేసినట్లు అయితే అది చట్ట రీత్యా నేరం అని అన్నారు. కరీంనగర్ జిల్లా ను బాల్య వివాహ ముక్త్ జిల్లా గా బాలల స్నేహ పూర్వక జిల్లా గా మార్చడానికి అందరు సహకరించాలని అన్నారు. ఈ కార్యక్రమం లో చైల్డ్ హెల్ప్ లైన్ 1098 కేసు వర్కర్ మహేష్, ప్రధానోపాధ్యాయులు, టీచర్స్ పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా ముగింపు

### పోలీస్ బందోబస్తు విజయవంతం - అధికారులను అభినందించిన కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి ప్రజాజ్యోతి డిసెంబర్ 18, (ప్రజా జ్యోతి):** రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో నిర్వహించిన గ్రామ పంచాయతీ ఎన్నికలు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా పూర్తిగా ప్రశాంత వాతావరణంలో ముగిశాయని పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. క్రమశిక్షణ, అప్రమత్తతతో చేపట్టిన సమర్థవంతమైన పోలీస్ బందోబస్తు వల్ల ఎన్నికలు విజయవంతంగా నిర్వహించగలిగామని ఆయన పేర్కొన్నారు. పెద్దపల్లి, మంచిర్యాల జోన్ల పరిధిలో మూడు విడతలుగా జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికలు శాంతియుతంగా సాగాయని కమిషనర్ ఒక ప్రకటనలో వెల్లడించారు. ఎన్నికల నిర్వహణలో పోలీస్ శాఖ అధికారులు, సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వర్తించారని తెలిపారు. పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు డీసీపీ భూక్యా రామ్ రెడ్డి, మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్‌ల సారథ్యంలో, అదనపు డీసీపీ (అడ్మిన్) కే. శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేందర్ గౌడ్, పెద్దపల్లి ఏసీపీ జి. కృష్ణ, గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్, మంచిర్యాల ఏసీపీ ఆర్. ప్రకాష్, జైపూర్ ఏసీపీ ఆర్. వెంకటేశ్వర్లు, బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, ఏఆర్ ఏసీపీ ప్రతాప్‌ల ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది పకడ్బందీగా విధులు నిర్వహించారని కమిషనర్ వివరించారు. ఇతర ప్రభుత్వ శాఖలతో సమన్వయం, ముందస్తు ప్రణాళికలు, కట్టుదిట్టమైన పర్యవేక్షణతో ఎన్నికల ప్రక్రియ పూర్తిగా స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షికంగా సాగిందని తెలిపారు. ఎన్నికలకు ముందు నుంచే పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, ప్రతి పోలింగ్ కేంద్రంలో భద్రతాఏర్పాట్లుపక్కాగాఅమలుచేసినట్లువెల్లడించారు. సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా, చెక్‌పోస్టులు, పికెట్స్, పెట్రోలింగ్, ఫ్లాగ్ మార్చ్‌లు నిర్వహించడం, రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్లను బైండోవర్ చేయడం వంటి చర్యలు శాంతిభద్రతల పరిరక్షణకు దోహదపడ్డాయని కమిషనర్ తెలిపారు. డీసీపీలు స్వయంగా గ్రామాలను సందర్శించి అభ్యర్థులు, ప్రజలకు ఎన్నికల నియమ నిబంధనలపై అవగాహన కల్పించారని చెప్పారు. నామినేషన్ ప్రక్రియ నుంచి ఫలితాల వెల్లడి వరకు ప్రతి దశలో పోలీసులు అత్యంత అప్రమత్తతతో విధులు నిర్వహించారని పేర్కొన్నారు. చలిని కూడా లెక్కచేయకుండా విధి నిర్వహణలో పాల్గొని ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేలా సహకరించిన ప్రతి పోలీస్ అధికారి, సిబ్బందికి కమిషనర్ అంబర్ కిషోర్ ఝా హృదయపూర్వక అభినందనలు తెలిపారు. పోలీస్ సేవలు ప్రజలకు అండగా నిలుస్తున్నాయనే నమ్మకం మరింత బలపడుతోందని పేర్కొంటూ, ఇదే సేవాభావం, నిబద్ధతతో రాబోయే ఎన్నికలతో పాటు శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ప్రజల భద్రతలో సమన్వయంతో పనిచేయాలని ఆయన ఆకాంక్షించారు.

# కాంగ్రెస్ పార్టీలో చేరిన మామిడిపల్లి సర్పంచ్ పన్నాల లక్ష్మారెడ్డి, ఉప సర్పంచ్ కాసర్ల పవిత్ర

### కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించిన రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**కొనరావుపేట: డిసెంబర్.18(ప్రజా జ్యోతి):** కోనరావుపేట మండలం మామిడిపల్లి గ్రామానికి నూతంగా ఎన్నికైన సర్పంచ్ పన్నాల లక్ష్మారెడ్డి, ఉప సర్పంచ్ కాసర్ల పవిత్ర వార్డు సభ్యులు బెదిరే మహిపాల్, కులేరి రవి, నంద్యాడపు రజిత, లోకుర్తి శంకర్ లు రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.. ఈ సందర్భంగా వారికి రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించినూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలియజేసి ఘనంగా సత్కరించారు..గ్రామాలతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతోందని తెలిపారు..నూతన పాలకవర్గానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు..



# అక్రమ కేసులతో బిజెపి దేశంలో అరాచకం సృష్టిస్తుంది

### కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్



**సిరిసిల్ల టౌన్ డిసెంబర్ 18(ప్రజాజ్యోతి):** ఏఐసిసి, టీపీసీసీ పిలుపు మేరకు రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ ఆధ్వర్యంలో నాయకులు గురువారం సిరిసిల్ల పట్టణంలో బిజెపి కేంద్ర ప్రభుత్వం సోనియా గాంధీ, రాహుల్ గాంధీ పై ఈడి కేసులను కోర్టు తప్పు పట్టినందుకు బిజెపి కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా గాంధీ, రాహుల్ గాంధీ ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్(ఈ డి) దాఖలు చేసిన ఛార్జిషీటును ఢిల్లీ హై కోర్టు పరిగణలోకి తీసుకోకపోవడం స్వాగతిస్తూ కేంద్ర ప్రభుత్వం తమ దర్యాప్తు సంస్థలతో రాహుల్ గాంధీ సోనియా గాంధీ లను వేధించడాన్ని ఖండించారు. రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా గాంధీ, రాహుల్ గాంధీ ఈడి దాఖలు చేసిన చార్జి సీటు ను ఢిల్లీ హై కోర్టు పరిగణలోకి తీసుకోలేదన్నారు. ఈ సంఘటన మోడీ, అమిత్ షా లకు చెంపపెట్టు లాంటిదని అన్నారు. మోడీ, అమిత్ షా దర్యాప్తు సంస్థలను తమ ప్రతీకార రాజకీయాల కోసం వాడుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ స్థానం ఏంటో అందరికి తెలిసిందే అన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంతో ఏ మాత్రం సంబంధం లేని బీజేపీ స్వాతంత్ర%శ్% నాటి పత్రిక పై మాట్లాడడం దారుణమని అన్నారు. బీజేపీ రాహుల్ గాంధీ, సోనియా గాంధీ పై చేస్తున్న ఆరోపణలు తీవ్రంగా ఖండిస్తున్నామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ నాగుల సత్యనారాయణ, మాజీ శాసనసభ్యులు కటకం మృత్యుంజయం, ఏఎంసీ చైర్మన్లు, సెస్ డైరెక్టర్లు, జిల్లా కాంగ్రెస్ నాయకులు, పట్టణ, మండల కాంగ్రెస్ అధ్యక్షులతో పాటు బ్లాక్ కాంగ్రెస్ నాయకులు, మహిళా కాంగ్రెస్ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి తంగలపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జలగం ప్రవీణ్ (టోనీ), జిల్లా కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా ఇన్చార్జి గడ్డం మధుకర్ (చోటు) తదితరులు పాల్గొన్నారు.

# పాలకవర్గాన్ని సన్మానించిన ఎమ్మెల్యే

**చొప్పదండి, డిసెంబర్ 18(ప్రజా జ్యోతి):** చొప్పదండి మండలంలోని వెదురుగట్ట గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ గా ఎన్నికైన పెంచాల శ్రీనివాస్, ఉపసర్పంచ్ మారం సమత శ్రీనివాస్, వార్డు సభ్యులు అందరూ కలిసి గురువారం ఎంఎల్‌ఏ మేడిపల్లి సత్యం ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే వారికి శాలువా కప్పి సత్కరించారు. అనంతరం సర్పంచ్, ఉప సర్పంచ్ లు ఎంఎల్ఏను గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఏ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లి అర్హులకు అందించాలని, అభివృద్ధి విషయంలో అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు నిజానపురం చందు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటి రెడ్డి పద్మాకర్ రెడ్డి, కిసాన్ సెల్ అధ్యక్షులు పురం రాజేశం, జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుమండ్ల గంగయ్య గౌడ్, మాజీ కౌన్సిలర్ కొట్టే అశోక్, మాజీ పట్టణ అధ్యక్షులు ముద్దం తిరుపతి గౌడ్, మునిగల సుధాకర్ గౌడ్, నేరుమట్ల మల్లేశం ,మార్కెట్ కమిటీ డైరెక్టర్ చిలుక సంజీవ్ ,గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ సర్పంచ్ లకు ఘన సన్మానం

**రామగిరి, డిసెంబర్ 18 (ప్రజాజ్యోతి) :** రామగిరి మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మద్దతుతో గెలుపొందిన నూతన ప్రజా ప్రతినిధులకు గురువారం సెంటెనరీ కాలనీ టౌన్‌లోని ఐఎన్‌టీయూసీ శ్రీపాద భవన్‌లో ఘనంగా సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల కాంగ్రెస్ అధ్యక్షులు రొడ్డ బాపన్న, టౌన్ అధ్యక్షులు కాటం సత్యం నేతృత్వం వహించగా, మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్ పాల్గొన్నారు. మంత్రి శ్రీధర్ బాబు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి శ్రీనుబాబుల సూచనతో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులుగా ఎన్నికల్లో గెలిచిన సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులను శాలువాలతో సత్కరించారు. పన్నూర్ %-% సర్పంచ్ చిందం మహేష్ ,

నవాబ్‌పేట - సర్పంచ్: రొడ్డ మౌనిక కుమార్

లద్నాపూర్ - సర్పంచ్: వనం రామచంద్ర రావు

రాజాపూర్ -సర్పంచ్: పుల్లెల భాగ్యలక్ష్మి కొమురయ్య

ఆదివారం పేట - సర్పంచ్ ఇల్లందుల సంజీవ్,

సుందిల్ల - సర్పంచ్: ముస్కుల నరేందర్ రెడ్డి,

లొంకా కేసారం - సర్పంచ్: వీరగోని రమాదేవి,

బేగంపేట - ఉప సర్పంచ్: సందెల రేణుక కుమార్,

నాగేపల్లి - ఉప సర్పంచ్: యాసం సతీష్,

చందనాపూర్ -ఉప సర్పంచ్: చిగురు రజిత

ఈ సందర్భంగా తొట్ల తిరుపతి యాదవ్ మాట్లాడుతూ రామగిరి మండలంలోని 15 గ్రామపంచాయతీలకు ఎన్నికలు జరిగాయని, వాటిలో కాంగ్రెస్ పార్టీ మద్దతుతో 10 గ్రామపంచాయతీలను కైవసం చేసుకున్నట్లు తెలిపారు. మిగిలిన గ్రామాల్లో లోటుపాట్లపై సమీక్ష చేసి రాబోయే ఎంపిటీసీ, జెడ్పిటీసీ ఎన్నికలకు సిద్ధం కావాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# వేములవాడ అర్బన్ మండలం సర్పంచ్ ల ఫోరం కార్యవర్గ నియామకం

**శుభాకాంక్షలు తెలిపిన ప్రభుత్వ విప్**

**వేములవాడ డిసెంబర్, 18:**ప్రజాజ్యోతి:వేములవాడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలోగురువారం



ఏర్పాటు చేసిన సమావేశంలో వేములవాడ అర్బన్ మండల సర్పంచ్ ల ఫోరంకార్యవర్గాన్ని నియమించారు. ఈ సందర్భంగా మొదటి రెండున్నర సంవత్సరాల పాటు శభాష్ పల్లి సర్పంచ్ అన్నబోయిన తిరుపతి యాదవ్ సర్పంచ్ ల ఫోరం అధ్యక్షుడుగా ఉంటారు తర్వాతి రెండున్నర సంవత్సరాల పాటు సర్పంచ్ ల ఫోరం అధ్యక్షుడుగా ఆరేపల్లి సర్పంచ్ ఇటిక్యాల రాజు కొనసాగుతారని తీర్మానం చేశారు. ఉపాధ్యక్షులుగా అనుపురం సర్పంచ్‌శేర్ల రాజేశ్వరి మల్లేశం, కొడుముంజ సర్పంచ్ కదిరే రాజు, ప్రధాన కార్యదర్శిగా కొలుగూరి మధు కిరణ్మయి, అధికార ప్రతినిధి గుర్రం వానిపల్లి సర్పంచ్ జ్వాల స్వాతి సురేష్ రెడ్డి, కార్యదర్శి మారుపాక సర్పంచ్ దొబ్బల మల్లేశం, ముఖ్య సలహాదారు ఇటిక్యాల రాజు లను నియమించారు.. నూతన కార్యవర్గానీ ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ శాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు..

# కాంగ్రెస్ వర్సెస్ బీజేపీ

**కరీంనగర్‌లో పొలిటికల్ వార్: నేషనల్ హెరాల్డ్ సెగ..**





**?కరీంనగర్ బ్యూరో,డిసెంబర్ 18 (ప్రజాజ్యోతి):** నేషనల్ హెరాల్డ్ కేసులో ఏఐసీసీ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలకు కోర్టులో ఊరట లభించడంతో కరీంనగర్ రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. ఒకవైపు కాంగ్రెస్ సంబరాలు, నిరసనలు.. మరోవైపు బీజేపీ ప్రతిఘటనతో నగరంలో ఉద్రిక్తత నెలకొంది..**కాంగ్రెస్ శ్రేణుల 'చలో ఎంపీ క్యాంపు కార్యాలయం'** ?ఏఐసీసీ, టీపీసీసీ పిలుపు మేరకు కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. కోర్టు చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం నుండి చైతన్యపురిలోని బీజేపీ ఎంపీ క్యాంపు కార్యాలయం ముట్టడికి కాంగ్రెస్ నాయకులు బయలుదేరారు.?నాయకుల అరెస్ట్: శాంతియుతంగా వెళ్తున్న తమను పోలీసులు అడ్డుకోవడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ నాయకులు రోడ్డుపై బైఠాయించారు. దీంతో ఉద్రిక్తత చోటుచేసుకోగా, పోలీసులు నాయకులను బలవంతంగా అరెస్ట్ చేసి పోలీస్ ట్రైనింగ్ సెంటర్ (%బుజ%)కు తరలించారు.?**నరేంద్ర మోదీ క్షమాపణ చెప్పాలి:**కాంగ్రెస్ నగర అధ్యక్షుడు అంజన్ కుమార్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాజకీయ కక్షతోనే ఈడీని అడ్డం పెట్టుకుని తప్పుడు కేసులు పెట్టిందని విమర్శించారు. నేషనల్ హెరాల్డ్ పత్రికా రంగానికి, స్వాతంత్ర పోరాటానికి చిహ్నమని, ఇప్పుడు కోర్టు తీర్పుతో బీజేపీ కుట్రలు బయటపడ్డాయని, ప్రధాని మోదీ వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.**బీజేపీ కౌంటర్ అటాక్ - జిల్లా కాంగ్రెస్ కార్యాలయ ముట్టడి:**?కాంగ్రెస్ ఆందోళనలకు వ్యతిరేకంగా బీజేపీ శ్రేణులు కూడా భారీగా రోడ్లపైకి వచ్చాయి. ఎంపీ క్యాంపు కార్యాలయం వద్ద కాంగ్రెస్ నేతలను అడ్డుకోవడంతో పాటు, జిల్లా కాంగ్రెస్ కార్యాలయాన్ని ముట్టడించేందుకు బీజేపీ నాయకులు యత్నించారు. బీజేపీ పార్లమెంట్ కన్వీనర్, మాజీ మేయర్ బోయినిపల్లి ప్రవీణ్ రావు, వాసాల రమేశ్ తదితర నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు.

# మంత్రి శ్రీధర్ బాబు సమక్షంలో కాంగ్రెస్ లో చేరిన గున్నూరు సర్పంచ్ చెరుకుతోట సురేష్ పటేల్

**మంథని, డిసెంబర్ 18 (ప్రజాజ్యోతి):** మంథని మండలంలోని గుమ్నూరు సర్పంచ్ గా ఎన్నికైన చెరుకుతోట సురేష్ పటేల్ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఇండిపెండెంట్ అభ్యర్థిగా గెలిచిన సురేష్ పటేల్ గ్రామ అభివృద్ధి కోసం గ్రామస్తుల నిర్ణయం మేరకు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా



గ్రామాభివృద్ధి కోసం పార్టీకి వచ్చిన సురేష్ ను మంత్రి శ్రీధర్ బాబు అభినందించారు. ఈ కార్యక్రమంలో మంథని మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుదల వెంకన్న, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఐలి ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా ఇంచార్జ్ ఆరెల్లి కిరణ్ గౌడ్, గ్రామస్తులు పాల్గొన్నారు

# అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**కార్పొరేషన్ పరిధిలో విస్తృతంగా పర్యటించిన రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారి, జిల్లా కలెక్టర్**



**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి ,(ప్రజా జ్యోతి(, డిసెంబర్ 18:** నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారి, జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.గురువారం రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారి, జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష విస్తృతంగా పర్యటించారు. గోదావరిఖని లోని సమ్మక్క-సారలమ్మ గద్దెలు, స్మశాన వాటిక, అశోక్ నగర్ లోని గర్ల్స్ హై స్కూల్, గౌతమ్ నగర్ లోని అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, రామగుండం చౌరస్తా వద్ద నిర్మిస్తున్న ఆర్ అండ్ బి రోడ్డు పనులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, గోదావరిఖని సమ్మక్క- సారలమ్మ గద్దెల వద్ద సింగరేణి ఆధ్వర్యంలో చేపట్టిన పనులు త్వరగా పూర్తి చేయాలని, మున్సిపల్ శాఖ అధికారులు ఎప్పటికప్పుడు సింగరేణితో సమన్వయం చేసుకుంటూ పనులు పూర్తి చేయాలని అన్నారు. గోదావరిఖని నది ఒడ్డున ఉన్న స్మశాన వాటిక అభివృద్ధి కోసం డి పి ఆర్ తయారు చేయాలని కలెక్టర్ సూచించారు. అశోక్ నగర్ లోని గర్ల్స్ హై స్కూల్ అభివృద్ధి కోసం కోటి రూపాయలు మంజూరు చేయడం జరిగిందని, డిజైన్ ప్రకారం అభివృద్ధి పనులను నెల రోజులలో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. గౌతమ్ నగర్ వద్ద అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పనులు వేగం పెంచాలని కలెక్టర్ తెలిపారు. రామగుండం చౌరస్తా వద్ద చేపట్టిన ఆర్ అండ్ బి రోడ్డు నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట అడిషనల్ కమిషనర్ మారుతి ప్రసాద్, గురు వీర, ఈఈ రామన్ఆర్ బి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# బుధవారంపేట గ్రామపంచాయతీని ప్రయోగశాలగా మార్చిన సింగరేణి

**- బుధవారంపేట రైతులు, గ్రామస్తుల ఆగ్రహం**



**రామగిరి, డిసెంబర్ 18 (ప్రజాజ్యోతి) :** బుధవారంపేట గ్రామపంచాయతీ పరిధిలో సింగరేణి సంస్థ గత 15 ఏళ్లుగా చేపడుతున్న భూసేకరణ చర్యల వల్ల రైతులు, గ్రామస్తులు తీవ్రంగా నష్టపోతున్నారని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పరిధిలోని 708 ఎకరాల వ్యవసాయ భూములు, ఇండ్లను స్వాధీనం చేసుకుంటామని అప్పట్లో నోటిఫికేషన్లు జారీ చేసి అవార్డు పాస్ చేసిన సింగరేణి, పరిహారంపై ఏకాభిప్రాయం కుదరకపోవడంతో రైతులు కోర్టును ఆశ్రయించారు. కోర్టు తీర్పు మేరకు కొంతమంది రైతుల భూములు మాత్రమే వారి పేర్లపై నమోదు కాగా, మిగతావారికి ఇప్పటికీ న్యాయం జరగలేదని ఆరోపించారు. ఇప్పటికే 88 ఎకరాలు స్వాధీనం చేసుకున్న సింగరేణి, మరో 444 ఎకరాల భూమిని మాత్రమే తీసుకుంటామని హద్దులు నిర్ణయించడం వివాదాస్పదంగా మారింది. ఇదే సమయంలో గ్రామపంచాయతీకి ఎలాంటి నోటీసులు, గ్రామసభలు లేకుండానే కొన్ని ఇండ్లకు నెంబర్లు వేస్తామని రాత్రికి రాత్రే ప్రకటన చేయడంతో గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది. సర్వేకు వచ్చిన రెవెన్యూ, సింగరేణి సిబ్బందిని రైతులు, గ్రామస్తులు అడ్డుకుని వెనక్కి పంపించారు. భూసేకరణ పేరుతో గ్రామంలో అభివృద్ధి పనులు నిలిచిపోయాయని, రైతుబంధు, రైతు బీమా, క్రాప్ లోన్లు వంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలు కూడా అందకుండా పోయాయని గ్రామస్తులు ఆరోపించారు. ఇది 'విభజించి పాలించు' విధానానికి నిదర్శనమని పేర్కొన్నారు. మొత్తం గ్రామం, వ్యవసాయ భూములను సమగ్రంగా తీసుకుని సరైన పరిహారం చెల్లించి, ఆర్ అండ్ ఆర్ ద్వారా అన్ని వసతులతో కొత్త గ్రామాన్ని ఏర్పాటు చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సింగరేణి పనులను అడ్డుకుని తీవ్ర స్థాయి ఉద్యమాలకు సిద్ధమని రైతులు, గ్రామ ప్రజలు మూకుమ్మడిగా హెచ్చరించారు.

# చేనేత వస్త్రములను కొనుగోలు చేసి చేనేతకు చేయూతనివ్వగలరు

**డివిజనల్ మార్కెటింగ్ ఆఫీసర్ వి. జనార్దన్**

పెద్దపల్లి జిల్లా ప్రతినిధి,(ప్రజా జ్యోతి), డిసెంబర్-18: చేనేత వస్త్రములను కొనుగోలు చేసి చేనేతకు చేయూతనివ్వగలరని డివిజనల్ మార్కెటింగ్ ఆఫీసర్ వి. జనార్దన్( కరీంనగర్) గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.టెస్కో, గోదావరిఖని విక్రయశాల మెదర్ బస్తీ నుండి షాపు నెం. 26, మున్సిపాల్ షాపింగ్ కాంప్లెక్స్, పోచమ్మగుడి దగ్గర, లక్ష్మి నగరనకు మార్చబడినది, టెస్కో విక్రయశాల యందు జనరల్ వస్త్రములు అనగా బందర్, రాజమండ్రి, మాదవరం, గద్వాల్, బెడ్షీట్స్, టవల్స్, లుంగీలు, నవర్లు కలవు వాటిపై 30% ప్రత్యేక తగ్గింపు కలదు, రాజ్కోట్, పై 40% తగ్గింపు కలదు అని, మా వద్ద చేనేత లక్ష్మి పథకం కలదు. ఇట్టి స్కీం నందు (4) లేదా (9) నెలలు రూ. 500, 1000, 1500లు వాయిదా పద్దతిలో చెల్లించి (5) లేదా (10) నెల అంతము తర్వాత వస్త్రములను ఖరీదు చేయగలరని తెలిపారు.పైన తెలిపిన స్కీంల ద్వారా కొనుగోలు దారులు చేనేత వస్త్రములను విరివిరిగా కొనుగోలు చేసి చేనేతకు చేయూతనివ్వగలరని, చేనేత పారిశ్రామికులకు పని కల్పించాలని డివిజనల్ మార్కెటింగ్ ఆఫీసర్ వి. జనార్దన్ ఆ ప్రకటనలో తెలిపారు.

# పెద్దపల్లి డీఎంహెచ్ఓగా డా. కె. ప్రమోద్ కుమార్ బాధ్యతల స్వీకరణ

**ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష, దిశానిర్దేశం**

పెద్దపల్లి జిల్లా ప్రతినిధి,(ప్రజా జ్యోతి), డిసెంబర్ 18: పెద్దపల్లి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్ఓ)గా డాక్టర్ కె. ప్రమోద్ కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా కలెక్టర్ శ్రీ కోయ శ్రీహర్షను, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) దాసరి వేణును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ భేటీలో డాక్టర్ వి. వాణిశ్రీ కూడా పాల్గొన్నారు.ఇప్పటివరకు ఇన్‌చార్జి డీఎంహెచ్ఓగా విధులు నిర్వహించిన డాక్టర్ వి. వాణిశ్రీ యథావిధిగా ప్రోగ్రాం అధికారి (ఎంహెచ్ఎన్)గా పెద్దపల్లిలోనే కొనసాగనున్నట్లు అధికారులు తెలిపారు.బాధ్యతలు స్వీకరించిన అనంతరం డీఎంహెచ్ఓ డాక్టర్ కె. ప్రమోద్ కుమార్ ఆర్‌బీఎస్‌కే సిబ్బందితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పాల్గొని, ఆరోగ్య కార్యక్రమాల సమర్థవంతమైన అమలుపై పలు సూచనలు,



దిశానిర్దేశం చేశారు.ఈ సమీక్ష సమావేశంలో వివిధ ప్రోగ్రాం అధికారులు, ఆర్‌బీఎస్‌కే డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# జాతర ఏర్పాట్ల ప్రతిపాదనలు డిసెంబర్ 22 లోగా సమర్పించాలి:

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**సమ్మక్క సారలమ్మ జాతర నిర్వహణ పై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించిన జిల్లా కలెక్టర్**

పెద్దపల్లి జిల్లా ప్రతినిధి ,(ప్రజాజ్యోతి), డిసెంబర్ 18:- సమక్క సారలమ్మ జాతర ఏర్పాట్ల ప్రతిపాదనలు డిసెంబర్ 22 లోగా సమర్పించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమ్మక్క సారలమ్మ జాతర నిర్వహణ పై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, సమ్మక్క సారలమ్మ జాతర నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు పంచాయతీ రాజ్ అధికారులు కట్టుదిట్టంగా చేపట్టాలని అన్నారు.గోలివాడ సమ్మక్క సారలమ్మ జాతర నిర్వహణకు సంబంధించి చేపట్టాల్సిన పంచాయతీ రోడ్ల మరమ్మత్తులు, క్యూ లైన్ల ఏర్పాటు, ఇతర పనులకు సంబంధించి ప్రతిపాదనలు డిసెంబర్ 22 లోపు సమర్పించాలని కలెక్టర్ తెలిపారు.గోదావరిఖని, గోలివాడ జాతర నిర్వహణ ప్రాంతాలలో పారిశుద్ధ్య నిర్వహణ సంబంధించి పంచాయతీ అధికారులు, కార్పొరేషన్ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అదనపు సిబ్బంది నియమించాలని కలెక్టర్ తెలిపారు. విద్యుత్ సరఫరా లో ఎటువంటి కోతల రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. జాతర దగ్గర స్టాండ్ బై ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేయాలని అన్నారు. జాతర నిర్వహణ విధులలో పాల్గొనే



సిబ్బందికి నాణ్యమైన భోజనం త్రాగునీరు ఇతర ఏర్పాట్లు కల్పించాలని దేవదాయ శాఖ అధికారులను కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి బి గంగయ్య, కరీంనగర్ దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సుప్రియ, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఇల్లందకుంట మండలంలో భారీ మెజార్టీ సర్పంచ్

జమ్మికుంట,డిసెంబరు18 ( ప్రజాజ్యోతి ): ఇల్లందకుంట గ్రామ పంచాయతీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థి ధార సురేష్ రికార్డు స్థాయి మెజారిటీతో ఘన విజయం సాధించి తన సత్తా చాటారు. మండలంలోనే అత్యధికంగా 660 ఓట్ల భారీ మెజారిటీ విజయం సాధించారు. సురేష్ కు 1561 ఓట్లు పోల్ కాగా, ఆయన ప్రత్యర్థి కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థి మారపెల్లి సృజన్ బాబుకు 901 ఓట్లు దక్కాయి. దింతో 660 ఓట్ల మెజార్టీ తో సురేష్ విజయదంకా మోగించారు.



మండలంలో అత్యధిక మెజార్టీతో గెలిపించిన సురేష్ ని గ్రామ ప్రజలు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో అత్యధిక భారీ మెజార్టీతో గెలిపించిన గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు అందరికీ అందుబాటులో ఉంటూ గ్రామ సమస్యలపై పట్టు సాధించి సమస్యల పరిష్కారానికి పని చేస్తానని హామీ ఇచ్చారు.

# డిసెంబర్ 20 న కలెక్టరేట్ లో అవగాహన శిబిరం

**-లీడ్ బ్యాంకు మేనేజర్ వేంకటేష్**

పెద్దపల్లి జిల్లా ప్రతినిధి, (ప్రజా జ్యోతి) డిసెంబర్-18:- కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిధిలోని ఆర్థిక సేవలు విభాగం ఆదేశాలకు అనుగుణంగా మీ డబ్బు - మీ హక్కుఅనే అంశంపై కలెక్టరేట్ లో డిసెంబర్ 20న శనివారం అవగాహన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు లీడ్ బ్యాంకు మేనేజర్ వేంకటేశ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. క్లెయిమ్ చేసుకొని బ్యాంకు పొదుపులు, షేర్లు, డివిడెంట్స్, మ్యూచువల్ ఫండ్స్, బీమా తదితరాలకు సంబంధించి డబ్బు క్లెయిమ్ చేసుకునే అవకాశం కల్పించేందుకు శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. బ్యాంకుల్లో 10 ఏళ్లకు పైగా క్లైమ్ చేసుకుని డిపాజిట్ల వివరాలు ఆర్బిఐ ఉద్గమ్ వెబ్సైట్ ద్వారా పొందవచ్చని సూచించారు. ఆర్థికపరమైన సమస్యల పరిష్కారానికి డిసెంబర్ 31 వరకు సర్కారు వీలు కల్పించిందని తెలిపారు. డిసెంబర్ 20న నిర్వహించే అవగాహన శిబిరంలో పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# నేడు రామగుండం కోల్ మైన్ పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ

రామగిరి, డిసెంబర్ 18 (ప్రజాజ్యోతి) : రామగుండం కోల్ మైన్ విస్తరణకు సంబంధించి నేడు పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ (పబ్లిక్ హియరింగ్) నిర్వహించనున్నారు.



ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం, ఈ కార్యక్రమం ద్వారా ప్రభావిత గ్రామాల ప్రజలు, కార్మిక సంఘాలు, పర్యావరణ కార్యకర్తలు తమ అభిప్రాయాలు, సూచనలు, అభ్యంతరాలను అధికారుల దృష్టికి తీసుకురానున్నారు. కోల్ మైన్ కార్యకలాపాల వల్ల పర్యావరణంపై పడే ప్రభావం, గాలి, నీటి కాలుష్యం, భూసేకరణ, పునరావాసం, పునరస్థాపన (ఆర్ అండ్ ఆర్) అంశాలపై ప్రజల నుంచి స్పష్టమైన అభిప్రాయాలు నమోదు చేయనున్నారు. అలాగే స్థానికులకు ఉపాధి అవకాశాలు, ఆరోగ్య సమస్యలు, భద్రత చర్యలపై కూడా చర్చ జరిగే అవకాశముంది. ఈ ప్రజాభిప్రాయ సేకరణకు జిల్లా యంత్రాంగం, పర్యావరణ శాఖ అధికారులు, సింగరేణి సంస్థ ప్రతినిధులు హాజరుకానున్నారు. కార్యక్రమం ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆర్జీ-3 జీఎం నరేంద్ర.సుధాకర్ రావు తెలిపారు. ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై తమ అభిప్రాయాలను వెల్లడించాలని వారు కోరారు.

# గ్రామాభివృద్ధికి సర్పంచులు కృషి చేయాలి

**గెలిచిన ప్రజాప్రతినిధులకు మాజీ ఎమ్మెల్యే చందర్ అభినందనలు**

పెద్దపల్లి జిల్లా ప్రతినిధి,( ప్రజా జ్యోతి), డిసెంబర్ 18:గ్రామ



సర్పంచులు గ్రామాల అభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు అండగా నిలవాలని పెద్దపల్లి జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు, రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పిలుపునిచ్చారు. గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.పెద్దపల్లి జిల్లాలోని ధర్మపురి నియోజకవర్గం ఇంచార్జి కొప్పుల ఈశ్వర్, పెద్దపల్లి నియోజకవర్గం ఇంచార్జి దాసరి మనోహర్ రెడ్డి, మంథని నియోజకవర్గం ఇంచార్జి పుట్ట మధు లతో పాటు గ్రామపంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించిన సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు మెంబర్లకు ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. అలాగే గ్రామాల్లో గులాబీ జెండా ఎగరడానికి కృషి చేసిన నాయకులు, కార్యకర్తలు, ఉద్యమకారులకు అభినందనలు తెలియజేశారు. రామగుండం, పెద్దపల్లి, మంథని నియోజకవర్గాల్లో జరిగిన మొదటి, రెండవ, మూడవ విడత గ్రామపంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులు ఘన విజయం సాధించారని పేర్కొన్నారు. గెలిచిన ప్రజాప్రతినిధులు తమ గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తూ, ప్రజలు తమపై ఉంచిన విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా విజయం సాధించిన సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు మెంబర్లను త్వరలోనే పెద్దపల్లి జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో ఘనంగా సత్కరిస్తామని కోరుకంటి చందర్ తెలిపారు.

## శుభాకాంక్షలు తెలియజేసిన జిల్లా మున్నూరుకాపు అధ్యక్షుడు



**వేములవాడ డిసెంబర్, 18:ప్రజాజ్యోతి.**
వేములవాడ అర్బన్ మండలం ప్రధాన కార్యదర్శి గా ఎన్నిక అయినా కొలుగురి. కీరణ్మయి మధు దంపతులకు మున్నూరు కాపు జిల్లా అధ్యక్షులు బొప్ప. దేవయ్య శుభాకాంక్షలు తెలియజేసారు. మీపైన నమ్మకం ఉంచి గెలిపించిన మీ చీర్లవంచ గ్రామం కు, సేవ చేయడం కాకుండా వేములవాడ అర్బన్ మండలం అభివ ృద్ధికి వేములవాడ %ఎశ్రీఖ% ప్రభుత్వవిప్ గారి తొడ్పాటుతో మీ మండలం కమిటీ ముందు ఉండాలి అని సూచించారు.,

## గంగాధర మండలంలో పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే

**గంగాధర 18 డిసెంబర్ 2025:(ప్రజా జ్యోతి):**
గంగాధర మండలంలోని మల్లాపూర్, గోపాలరావుపల్లి గ్రామాలలో గురువారంపిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే ను కరీంనగర్ జిల్లా గణాంక శాఖ అధికారి గుర్రం శ్రీనివాస్ గౌడ్ నిర్వహించారు. జాతీయ గణాంక శాఖ 2025వ సంవత్సరానికి గాను ప్రజల ఉపాధి స్థితిగతులపై పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే నిర్వహిస్తున్న సర్వేల్లో భాగంగా కరీంనగర్ జిల్లా గంగాధర మండలంలోని మల్లాపూర్ మరియు గోపాలరావు పల్లె గ్రామాల్లో గురువారం గణాంక శాఖ అధికారి గుర్రం శ్రీనివాస్ గౌడ్ సర్వేను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా పట్టణాలు గ్రామాలను ఎంపిక చేసుకుని ప్రజల ఉపాధి స్థితిగతులపై సర్వేలో భాగంగా మొదట సాధారణ వివరాలతో సర్వే చేసిన అనంతరం ట్యాబ్ ద్వారా గ్రామంలో కొన్ని కుటుంబాలను ఎంపిక చేసి మూడు నెలల పాటు నెలకు ఒకసారి పూర్తి సర్వే చేసి ప్రత్యేక ట్యాబ్లో వివరాలు నమోదు చేస్తామని గుర్రం శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. తొలి విడతలో కుటుంబ యజమాని పేరు సభ్యులు వారి విద్యా అర్హతల గురించి చదువు మానేసిన ఉన్నత చదువులు వ ృత్తివిద్య కోర్సులు ఉద్యోగం స్వయం ఉపాధి వివరాలు రోజువారి కూలీ అయితే వారంలో ఏ పని చేశారో ఎన్ని గంటలు పని చేశారో ఎంత వేతనం పొందారో వివరాలతో పాటు మహిళలు స్వయం ఉపాధి పొందే వాళ ృ అయితే వారి ఆదాయ వివరాలను కూడా నమోదు చేసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో రజిత, ఎంపీడీవో దమ్మని రాము, ఎంపీ ఓ ప్రత్యూష, ఎంపీ ఎస్ఓ చిన్నయ్య, గ్రామపంచాయతీ సెక్రటరీలు సాయికుమార్ మరియు సంతోష్ అంగన్వాడి టీచర్లు రమణ ,కవిత, అరుణ మరియు ఆశ వర్కర్లు శారద, రేఖ, అనిత మరియు కారోబార్ రమేష్ మరియు గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణకు కలెక్టర్‌కు కృతజ్ఞతలు

### సిబ్బంది సేవలను ప్రశంసించిన జిల్లా ఎన్నికల అధికారి



**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి,(ప్రజా జ్యోతి) , డిసెంబర్ 18:**
జిల్లాలో ఇటీవల నిర్వహించిన 3వ సాధారణ గ్రామపంచాయతీ ఎన్నికలు%--%2025ను మూడు దశల్లో ఎటువంటి అవాంతరాలు లేకుండా విజయవంతంగా పూర్తిచేసిన సందర్భంగా జిల్లా పంచాయతీ కార్యాలయ సిబ్బంది గౌరవనీయ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శ్రీ కోయ శ్రీ హర్ష ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎన్నికల నిర్వహణలో సమర్థవంతమైననాయకత్వం, మార్గదర్శకత్వం అందించినందుకు క ృతజ్ఞతలు తెలుపుతూ కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, ఎన్నికల ప్రక్రియలో సిబ్బంది అందరూ చూపిన అంకితభావం, కష్టపడి చేసిన సేవలు, కలిసికట్టుగా విధులు నిర్వహించిన తీరు అభినందనీయమని ప్రశంసించారు. ప్రతి ఉద్యోగి తనకు కేటాయించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వహించినందువల్లనే ఎన్నికలు సజావుగా, శాంతియుతంగా ముగిశాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా ఎన్నికల అధికారి మరియు జిల్లా పంచాయతీ అధికారి శ్రీ వీరబుచ్చయ్య, డివిజనల్ పంచాయతీ అధికారి పెద్దపల్లి శ్రీ దేవకీదేవి, డీపీఎం (%ణావీ%)తో పాటు జిల్లా పంచాయతీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## వీణవంకలో ఇసుక మాఫియా ఆగడాలు

### ఆర్టీసీ బస్సును ఢీకొట్టబోయిన ఇసుక లారీ, తప్పిన పెను ప్రమాదం




**వీణవంక, డిసెంబర్ 18 , ( ప్రజాజ్యోతి ):**
వీణవంక మండలం పరిధిలోని చల్లూరు, మల్లారెడ్డిపల్లి, కొండపాక తదితర మానేరు పరివాహక ప్రాంతాల గ్రామాల నుంచి అక్రమంగా ఇసుక తరలింపు జరుగుతుండటంతో గ్రామస్తులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా లారీలకు వెల్డింగ్ మరమ్మతులు చేసి, ఇంజన్‌కు టాప్ టు టాప్‌గా ఇసుక నింపుతూ కోట్లాది రూపాయల అక్రమ లాభాలు పొందుతున్నారని ఆరోపిస్తున్నారు. ఈ అక్రమ రవాణా వల్ల ప్రభుత్వానికి భారీగా ఆదాయ నష్టం జరుగుతుండగా, భూగర్భ జలాల మట్టం క్రమంగా పడిపోతోందని గ్రామస్తులు వాపోతున్నారు. ఇసుక మాఫియా అక్రమాల కారణంగా వ్యవసాయంపై తీవ్ర ప్రభావం పడటంతో పాటు తాగునీటి సమస్యలు కూడా పెరుగుతున్నాయని తెలిపారు. ఇదే క్రమంలో ఇటీవల ఒక ఇసుక లారీ వేగంగా వచ్చి ఆర్టీసీ బస్సును ఢీకొట్టబోయిన ఘటన చోటుచేసుకుంది. డ్రైవర్ అప్రమత్తతతో పెను ప్రమాదం తప్పినప్పటికీ, ఈ ఘటన అక్రమ ఇసుక రవాణా ఎంతటి ప్రమాదాలకు దారి తీస్తుందో స్పష్టంగా చూపుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి లారీపై కఠిన పర్యవేక్షణ చేపట్టి, నిబంధనలు ఉల్లంఘించిన వాహనాల రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని, సంబంధిత యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని గ్రామస్తులు అధికారులను డిమాండ్ చేస్తున్నారు. ఇసుక మాఫియాపై తక్షణమే చర్యలు తీసుకుని పర్యావరణాన్ని, ప్రజల జీవనాధారాలను కాపాడాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ప్రశాంతంగా ముగిసిన మూడవ విడత స్థానిక సంస్థల ఎన్నికలు

**-హుజురాబాద్ 85. 94 శాతం ఓటింగ్ -జమ్మికుంట 85. 72 శాతం ఓటింగ్**

**-ఇల్లందకుంట 87. 05 శాతం ఓటింగ్ -వీణవంక 85. 87 శాతం ఓటింగ్**



**జమ్మికుంట,డిసెంబర్ 19, (ప్రజా జ్యోతి):**
హుజురాబాద్ డివిజన్ లో నిర్వహించిన మూడో విడత స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఎన్నికల్లో భాగంగా హుజురాబాద్ మండలంలోని 20 గ్రామపంచాయతీలో 85.94 శాతం ఓటింగ్ నమోదయింది. మండలంలోని 20 గ్రామాల్లో 35943 ఓటర్లు ఉండగా వారిలో 17257 పురుషులు, 18686 స్త్రీలు ఉన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో కలిపి 30891 ఓటు హక్కును వినియోగించు కున్నారు. ఇందులో 14915 పురుషులు, 15976 మహిళలు ఉన్నారు. ?? జమ్మి కుంట మండలంలో 20 గ్రామపంచాయతీలో 85. 72 శాతం ఓటింగ్ నమోదైంది. మండలంలోని 20 గ్రామాల్లో 28929 ఓటర్లు ఉండగా వారిలో 14094 పురుషులు, 14835 స్త్రీలు ఉన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో కలిపి 24798 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ?? ఇల్లందకుంట మండలంలో 18 గ్రామపంచాయతీలో 87. 05 శాతం ఓటింగ్ నమోదైంది. మండలంలోని 18 గ్రామాల్లో 26100 ఓటర్లు ఉండగా వారిలో 12761 పురుషులు, 13338 స్త్రీలు ఉన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో కలిపి 22720 మంది ఓటు హక్కును వినియోగించు కున్నారు. వీణవంక మండలంలో 26 గ్రామపంచాయతీలో 85. 85 శాతం ఓటింగ్ నమోదైంది. మండలంలోని 26 గ్రామాల్లో 42659 ఓటర్లు ఉండగా వారిలో 20786 పురుషులు, 21872 స్త్రీలు ఉన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో కలిపి 36630 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ?? స్థానిక సంస్థల ఎన్నికల్లో మూడో విడత సర్పంచ్ ఎన్నికల్లో ప్రత్యర్థుల పై గెలుపొందిన సర్పంచ్ అభ్యర్థుల వివరాలు..

# మంత్రి శ్రీధర్ బాబును కలిసిన పుట్టపాక గ్రామ పంచాయతి పాలకవర్గం

**మంథని, డిసెంబర్ 18 (ప్రజాజ్యోతి):**
మంథని మండలం పుట్టపాక గ్రామ పంచాయతికి నూతనంగా ఎన్నికైన పాలకవర్గం సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్ లోని మినిస్టర్ క్వార్టర్ లో ఐటీ, పరిశ్రమలు, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్చం అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. మంత్రి శ్రీధర్ బాబు నూతనంగా పుట్టపాక గ్రామ సర్పంచ్ గా ఎన్నుకోబడిన కన్నూరి రాజబాబు, ఉప సర్పంచ్ ఎల్ల శ్రవణ్ కుమార్, వార్డు సభ్యులు కన్నూరి సాయి కుమార్, కన్నూరి వసుంధర - సదానందం, కన్నూరి సుదర్శన్, కొత్త మౌనిక-ప్రవీణ్ లకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం పుట్టపాక గ్రామానికి సంబంధించిన పలు అభివృద్ధి పనులు నిమిత్తం వినతి పత్రం అందజేశారు. గ్రామాభివృద్ధి లక్ష్యంగా నూతనంగా ఏర్పడిన పాలవర్గం పని చేయాలని మంత్రి శ్రీధర్ బాబు సూచించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ సోషల్ మీడియా ఇన్చార్జ్ రేపాక శ్రీకాంత్, యూత్ కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు రేపాక లక్ష్మణ్ , యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఐలి సతీష్,



సీనియర్ నాయకులు సవాయి గణేష్, హుస్సేన్ భీ, కొమురయ్య, సల్ల రవీందర్, మహేందర్, కొత్త సతీష్, రవీందర్, శీలం ప్రభాకర్, గొల్లపల్లి రాజయ్య, ఆకుల సురేష్, సాయి, మధుకర్, వొనలదేవి శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు సర్వేను పరిశీలించిన రాష్ట్ర పరిశీలకులు డాక్టర్ సుజాత

**జగిత్యాల ప్రతినిధి,డిసెంబర్18,ప్రజాజ్యోతి..**
కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు సర్వేను రాష్ట్ర పరిశీలకులు, సీనియర్ మెడికల్ ఆఫీసర్ , స్టేట్ లెప్రసీ ఆఫీస్ తెలంగాణ,డాక్టర్ సుజాత సందర్శించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటి సందర్శన ఏ విధంగా జరుగుతుందో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం మోతేవాడ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిగిన సమావేశంలో ఈ సర్వే యొక్క ఉద్దేశాల గురించి వివరిస్తూ, ప్రతి ఏటా రెండు విడతలలో ఇంటింటి సర్వే చేపడుతున్నామని , తొలి విడత మార్చి నెలలో జరిగిందని, ఇప్పుడు రెండో విడతలో డిసెంబర్ 31 వరకు జరుగుతుందని ప్రజల%శీ%దరూ ఈ సర్వే కు సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్,డాక్టర్ ఏ శ్రీనివాస్, జిల్లా కుష్టు



నివారణ అధికారి డాక్టర్ ఎన్ శ్రీనివాస్, డాక్టర్ జైపాల్ రెడ్డి, డాక్టర్ స్రవంతి వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అదృష్ట సర్పంచ్‌లు అంటే వీరే..సల్ప ఓట్ల తేడాతో గెలుపు



ఒక్క ఓటు మెజార్టీ తో గెలిచిన బైరెడ్డి రమణారెడ్డి....



రెండు ఓట్ల మెజార్టీ తో గెలిచిన గుత్తికొండ రమ్య ...



3ఓట్ల మెజార్టీ తో గెలిచిన కందికట్ల మధుసూదన్

**జమ్మికుంట, డిసెంబరు18 (ప్రజాజ్యోతి):**
గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కొందరు సర్పంచ్‌లు అతి స్వల్ప మెజార్టీతో ఒక్క ఓటు, రెండు ఓట్ల తేడాతో గెలుపు సాధించిన అభ్యర్థులు అదృష్టం కలిసొచ్చిన వారిగా చర్చనీయాంశంగా మారారు.ఓట్ల లెక్కింపు సమయంలో ఉత్కంఠత వాతావరణం నెలకొనగా, చివరి రౌండ్‌లో తేడా తేలడంతో ఫలితాలు మారాయి. గ్రామస్థుల ప్రతి ఓటు ఎంత కీలకమో ఈ ఫలితాలు మరోసారి నిరూపించాయి. ఇల్లందకుంట మండలం పాతర్లపల్లి లో, శ్రీరాములపల్లి లో, జమ్మికుంట మండలంలోని కొరపల్లి లో ఇవే ఫలితాలు వెలువడ్డాయి.

**పాతర్లపల్లి రమణారెడ్డి కు 'ఒక్క' ఓటు అదృష్టం!**
ఇల్లందకుంట మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో పాతర్లపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థి బైరెడ్డి రమణారెడ్డి సంచలన విజయం సాధించారు. ఒక్క ఓటు తేడాతో విజయం సాధించిన బైరెడ్డి రమణారెడ్డి అందరి దృష్టి పడింది. ఆయన తన సమీప ప్రత్యర్థిపై చల్లూరి కృష్ణ పై కేవలం ఒక్కే ఒక్క ఓటు మెజారిటీతో గెలుపొందడం విశేషం. ఒక ఓటుతో గెలుపొందడం తన అదృష్టంగా భావిస్తున్నానని రమణారెడ్డి తెలిపారు.

**రెండు ఓట్లతో శ్రీరాములపల్లి సర్పంచ్ గా గుత్తికొండ రమ్య**
ఇల్లందకుంట మండలం శ్రీరాములపల్లి గ్రామ సర్పంచ్ అభ్యర్థి గా కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థి గుత్తికొండ రమ్య రెండు ఓటుతో విజయం సాధించారు. తన ప్రత్యర్థి బీఆర్ఎస్ అభ్యర్థి తిప్పరబోయిన శారదపై రెండు ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. రీకౌంటింగ్ లో పోస్టల్ బ్యాలెట్ తో పాటు మరొక ఓటు రావడం తో రెండు ఓట్ల తో గెలిచినట్లు రిటర్నింగ్ అధికారి ప్రకటించారు. దింతో అభిమానులు సంబరాలు జరుపుకున్నారు.

**కొరపల్లి సర్పంచ్ 3 ఓట్లతో విజయం**
జమ్మికుంట మండలం కొరపల్లి గ్రామ సర్పంచ్ స్వతంత్ర అభ్యర్థి కందికట్ల మధుసూదన్ 3 ఓట్ల మెజార్టీతో ఉత్కంఠ మధ్య విజయం సాధించారు. తన ప్రత్యర్థి పల్లె రవికుమార్ పై రీకౌంట్ నిర్వహించగా 3 ఓట్లు మెజార్టీతో గెలిచి సంచలనం సృష్టించారు. గతంలో ఒక్కసారి మధుసూదన్ సర్పంచ్ గెలిచారు. గ్రామ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని మధుసూదన్ పేర్కొన్నారు. గ్రామ ప్రజలకు మధుసూదన్ ధన్యవాదాలు తెలిపారు.

# విజయోత్సవ ర్యాలీకి జన నీరాజనం

## తుంగూరు సర్పంచ్‌గా రాజగోపాల్ రావు



**బీర్ పూర్, డిసెంబర్ 18 (ప్రజా జ్యోతి):**
బీర్ పూర్ మండలం తుంగూరు గ్రామంలో నూతన పాలకవర్గం ఆధ్వర్యంలో నిర్వహించిన విజయోత్సవ ర్యాలీకి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. సర్పంచ్‌గా భారీ మెజార్టీతో ఎన్నికైన రాజగోపాల్ రావు, ఉపసర్పంచ్, వార్డు సభ్యులకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు.పార్టీలకు అతీతంగా జరిగిన ఈ కార్యక్రమంలో, గ్రామ ప్రజలు, నాయకులు నూతన పాలకవర్గానికి మంగళహారతులతో, పూలమాలలు వేసి, తిలకం దిద్ది సత్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రాజగోపాల్ రావు మాట్లాడుతూ, తనపై ప్రజలు ఉంచిన నమ్మకాన్ని వమ్ముచేయకుండా, గ్రామ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తన గెలుపునకు సహకరించిన గ్రామ ప్రజలందరికీ ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ ర్యాలీలో పెద్ద ఎత్తున గ్రామస్తులు పాల్గొన్నారు.

# రేచపల్లి గ్రామ సర్పంచ్‌కు ఘన సన్మానం



**జగిత్యాల ప్రతినిధి, డిసెంబర్ 18 ( ప్రజాజ్యోతి)..**
జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం రేచపెల్లి గ్రామ సర్పంచ్ గా విజయం సాధించిన బాస మహేష్ పటేల్ ను తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఒక జర్నలిస్టు గా పనిచేస్తూ ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తూ జనం పవర్ పత్రిక ద్వారా సుపరిచితుడైన మహేష్ సర్పంచిగా ఎన్నిక కావడం హర్షణీయమని ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ ఇమ్రాన్ పేర్కొన్నారు. ప్రజా సేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. ఫెడరేషన్ సభ్యునిగా ఉండి సర్పంచిగా గెలవడం తన అదృష్టం గా భావిస్తున్నానని రేచపెల్లి ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని మహేష్ పటేల్ అన్నారు. కార్యక్రమం లో ఫెడరేషన్ కార్యదర్శి మెన్నేని రవీందర్ రావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రేణికుంట శ్రీనివాస్, ద్యావర సంజీవ రాజు, కోశాధికారి మెన్నెని శ్రీనివాస రావు, ఉపాధ్యక్షులు రాగం రమేష్, తెలంగాణ శక్తి సంపాదకులు అనంతుల కాంతారావు, మరిపెల్లి శ్రీనివాస్, ఎండి ఆజామ్, కిషన్ రావు లు పాల్గొన్నారు.